క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు అందజేశారు. క్యాతమ్ ఆంజనేయులుకు రూ.5 వేలు, బొలమోని కొండమ్మకు రూ.15 వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెంటయ్య, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, బొలమోని వెంకటస్వామి, దర్గేష్, రాఘవేందర్‌గౌడ్, సురేష్, నవీన్‌గౌడ్, రాఘవేంద్ర అందజేశారు.

వనపర్తిటౌన్: ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మంజూరు చేయించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్కాకుల సతీష్, ఎల్‌ఐ కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సంక్షేమానికి కృషి



కొత్తకోట రూరల్: రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్‌గా ఎన్నికైన కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన విశ్వనాథం వెంకటరమణను రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి సన్మానించారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లాలో వివిధ హోదాలో పనిచేసిన తనను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మిల్లర్లకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి, వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

వనపర్తి రూరల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసుగౌడ్, సురేందర్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజీ గార్డెన్ నుంచి లబ్ధిదారులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. 2008లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణమ్మ సర్వే నంబర్ 288లో 16 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 70 గజాల చొప్పున 1,200 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారని, నేటి వరకు స్థలాలు అప్పగించలేదని అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు పట్టాలను అందించి చేతులు దులుపుకున్నారని, ఆ స్థలంలో ప్రస్తుతం డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు స్థలాలు అప్పగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహమూద్, గయాసుద్దీన్, రాజు, అజయ్, బుచ్చన్న, ఇస్మాయిల్, రాములు, వెంకటేష్, తిరుపతి, శ్రీను, సాయిలు, లబ్ధిదారులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రూ. 95 లక్షలతో ప్రారంభించిన మన ఊరు మనబడిలో కార్యక్రమంలో భాగంగా నిర్మాణపనులు త్వరగా పూర్తి చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, మణికంఠ, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే రోగాలు దూరం



సవాయిగుడెంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ పద్మావతి



అమరచింతలో ముళ్ల పొదలను తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్, సిబ్బంది

వనపర్తి టౌన్: ప్రజలు ముందు జాగ్రత్తలు పాటిస్తేనే రోగాలకు దూరంగా ఉండొచ్చని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. శుక్రవారం వనపర్తిలోని 19, 20వ వార్డుల్లో డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించామన్నారు. పలు కాలనీల్లో డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రకళ, ఎల్ఐసీ కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. డ్రై డే ఫ్రై డే, స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆత్మకూర్ పట్టణంలోని 3వ వార్డులో కౌన్సిలర్ అశ్విన్‌కుమార్ పారిశుద్ధ్య పనులు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటిద్దామని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కమిషనర్ సూర్యకుమార్ డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీర్లనాగన్నసాగర్, మున్సిపల్ సిబ్బంది శ్రీధర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రైడే ఫ్రైడేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు అన్నారంలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జ్వర అనుమానితుల నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని మండల ప్రతేకాధికారి ఆర్డీఓ పద్మావతి అన్నారు. మండలంలోని సవాయిగుడెంలో ఆమె పర్యటించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపల్‌కు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఆమె పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డిని తొలగించడం, రహదారిపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించడం వంటి పనులను మున్సిపల్ కార్మికులతో చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ నురుల్‌నదీం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



కొత్తకోటలో..



పాన్‌గల్‌లో..

రాజభవనం వద్ద ఫ్లోరింగ్ పనులు ప్రారంభం



ఫ్లోరింగ్ పనులు పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తిటౌన్: పట్టణంలోని కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ముందు భాగంలో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ముందు భాగంలో అనాలోచితంగా వేసిన సీసీ రోడ్డుతో వర్షపు నీరు కాలేజీలోకి వెళ్తోందని విమర్శించారు. విద్యార్థుల అవస్థలను ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో లాక్కకుల సతీష్, వెంకటేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు



విజేతలుగా నిలిచిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారంతో ముగిసాయి. మొదటి రోజు అండర్-14, రెండో రోజు అండర్-17 విభాగంలో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు తెలిపారు. అండర్-17 ఖోఖో బాలుర విభాగంలో కేతేపల్లి ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో రేమద్దుల, బాలికల విభాగంలో ప్రథమ స్థానం పాన్‌గల్ బాలిక ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో కేతేపల్లి, కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ స్థానం కేతేపల్లి, ద్వితీయ స్థానంలో లిటిల్ స్టార్ హైస్కూల్ తెల్లరాళ్లపల్లి, కబడ్డీ బాలికల విభాగంలో పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో మాందాపూర్ పాఠశాల, వాలీబాల్ విభాగంలో కేతేపల్లి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో తెల్లరాళ్లపల్లి లిటిల్ స్టార్ హైస్కూల్ నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హైమావతి, హెచ్ఎంలు నరేందర్, విజయలక్ష్మి, పీఈడీలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాందాపూర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో మాందాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 విభాగంలో బాలికలు ఖోఖో, కబడ్డీ, బాలురు వాలీబాల్, ఖోఖోలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, పీఈడీ గోవింద్‌ను శుక్రవారం పాఠశాల హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

పొగ గొట్టాలు ఏర్పాటు చేసుకోవాలి



మటన్ షాపుల యజమానులకు నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ మేనేజర్ రవీందర్

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో హైదరాబాద్ వెళ్లే రోడ్డులో విచ్చలవిడిగా మటన్ షాపులు వెలిశాయి. ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఏర్పాటు చేయడంతో పాటు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. అంతే కాకుండా మటన్ షాపుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డుపక్కన మటన్ కాల్చుతుండడం వలన పొగ అంతటా వ్యాపించి ప్రజలు, అటుగా వెళ్లే వాహనదారులు అస్వస్థతకు గురవుతున్నారని, 7 రోజుల్లో మటన్ షాపుల వద్ద పొగ గొట్టాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు వ్యర్థాలు నిర్వహణ సక్రమంగా చేయాలని నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ మేనేజర్ రవీందర్ తెలిపారు. మటన్, చికెన్ షాపులు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 50ఫీట్లలోపు ఉండేవిధంగా చూసుకోవాలని, లేని ఎడల తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారు. నిబంధనలు పాటించకపోతే మున్సిపల్ చట్టం ప్రకారం రూ.10వేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ



మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్

అమరచింత: కొత్త ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న వాటిని సరిచేసుకునే అవకాశాన్ని శనివారం వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని డీపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే కొత్త ఓటరు జాబితాలను ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ఉంచామని, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్విహించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాలను అమలు పర్చాల్సిన బాధ్యత స్పెషల్ ఆఫీసర్లపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. టీపీయూఎస్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులతో సభ్యత్వాన్ని నమోదు చేశారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల కృష్ణయ్య, రమేష్, అనురాధ, మల్లేష్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం లెక్చరర్లకు న్యాయం చేయాలి

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా పార్ట్‌టైం యూనివర్సిటీ లెక్చరర్లకు నెలకు రూ.50వేలు వేతనం చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్(టీజీ ఏయూపీటీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేసినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎర్రం నాగేంద్రం పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 13 యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైమ్ లెక్చరర్ల సమస్యలను మంత్రికి విన్నవించామన్నారు. ఈ విషయంపై మంత్రి స్పందించి, విషయాన్ని సీఎం, విద్యాశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డా.ఎం.కుమార్, డా.శ్రీలక్ష్మిరెడ్డి, డా.భిక్షపతి, డా.శేఖర్, డా.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలి



తపస్ సభ్యత్వాలను చేయిస్తున్న అమరేందర్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల కారణంగా చదువు కుంటుబడుతుందని, ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులు లేదా విద్యా వలంటీర్లను నియమించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తపస్ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పీఆర్సీని అమలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమాశంకర్, అరవింద్, మల్లేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, జన్ను భాస్కర్, అనురాధ, నారాయణ, సంతోష్‌కుమార్ ఉపాధ్యాయులు ఉన్నారు.

చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సభ్యులు

వనపర్తి రూరల్: విద్య ద్వారానే విద్యార్థులకు శక్తినిస్తుందని, అందరూ చదువుకొని ఉన్నతంగా రాణించాలని యువ సంయుక్త ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ ఆవుల అక్షయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువ సంయుక్త ఫౌండేషన్ నిర్వాహకులు ఆవుల అక్షయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు ప్రాథమిక అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలు, పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వంద మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల విద్యార్థులు యువ సంయుక్త ఫౌండేషన్ స్థాపించి అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు సహాయం అందించే లక్ష్యంతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ఆకాష్, వివేక్, అఖిల, సదా, వర్షిత, ప్రణీత, సోమాకుమార్, రఘురాం, రాహుల్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మమ్మ

వనపర్తి రూరల్: పోషక విలువలు గల ఆహారం తీసుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికత్వంతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతి నిత్యం ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు, నువ్వులు, బెల్లం, పాలు, పండ్లు మొదలగు ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. దీంతో పాటు పరిశుభ్రత కూడా ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సూపర్‌వైజర్ ఆసీయా, షాహిన్, లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అమరచింత: కిషోర బాలికలు ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సుపర్‌వైజర్ నర్మద అన్నారు. పోషణమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. కిషోర బాలికలు సరైన సమయంలో బలమైన ఆహారం తీసుకోవడం ద్వారా శారీరకంగా ఎదగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

ఎస్‌ఐ మండ్ల తేజస్వినికి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మండ్ల తేజస్విని ఎస్‌ఐగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకొని సొంత గ్రామానికి వచ్చిన సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామం నుంచి కలెక్టర్‌గా, ఎస్‌ఐగా ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని గ్రామ పెద్దలు సూచించారు. సామాన్య కుటుంబానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కాశమ్మ, మండ్ల రాములు కూతురు ఎస్‌ఐగా ఎంపిక కావడం గ్రామానికే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింహ, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మత్స్యకార సంఘం నాయకులు వెంకటయ్య, కురుమూర్తి, శ్రీనివాసులు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

20 రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీరు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న తండావాసులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు 20 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తండావాసులు వ్యవసాయ స్కీం బోర్లు, చేతిపంపులు, మరికొందరు సొంతంగా డబ్బులు పెట్టి నీటిని ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నట్లు తండావాసులు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. దాటవేసే ధోరణితోనే మాట్లాడుతున్నారు తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదని మాజీ సర్పంచ్ శాంతమ్మ, తండావాసులు వాపోయారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. బదిలీపై కొత్తగా గ్రామానికి వచ్చానని, నీటి ఇబ్బంది ఉన్నమాట వాస్తవమేనన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పంచాయతీ కార్యదర్శి కుర్మన్న పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



ఆత్మకూర్: భక్తిపారవశ్యంతో గణనాథుడి నిమజ్జనాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మండలంలోని పిన్నంచర్ల, జూరాల గ్రామాలతో పాటు, స్థానిక వినాయకనగర్, వడ్డెర వీధి, బీసీ కాలనీల్లో ప్రతిష్ఠించిన గణపయ్యలకు 14 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మహిళల కోలాటం, కళాకారుల డప్పుల వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీలో వేలాదిగా పాల్గొన్నారు. ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.

సాయిచంద్ మరణం తీరని లోటు



మదనాపురంలో మాట్లాడుతున్న రజిని

కొత్తకోట: ప్రజా గాయకుడు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ దివంగత సాయిచంద్ జయంతిని అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకలకు సాయిచంద్ సతీమణి గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని హాజరై అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, రాములుయాదవ్, గాడీల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: సాయిచంద్ మరణం దళిత జాతితో పాటు బడుగు బలహీన వర్గాల వారికి తీరని లోటు అని గిడ్డంగుల శాఖ మాజీ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సాయిచంద్ జయంతి వేడుకలకు హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్యయాదవ్, జయంతమ్మ, చాంద్‌పాషా, తిరుపతయ్య, మాసన్న, నారాయణ తదితరులు ఉన్నారు.

సోళీపురం ఉన్నత పాఠశాల వంటగదిలో నాగుపాము



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలోని వంటగది, స్టోర్ రూంలోకి శుక్రవారం నాగుపాము రావడంతో ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు హడలెత్తిపోయారు. ఉపాధ్యాయులు స్నేక్ క్యాచర్లకు సమాచారం ఇవ్వడంతో పర్యావరణ పరిరక్షకుడు సదాశివయ్య శిష్యుడు వనపర్తికి చెందిన అభిరాం వచ్చి పామును పట్టుకోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం హెచ్ఎం అబ్దుల్ అజీమ్ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. పర్యావరణంలో జీవరాసుల పాత్ర, వాటి లాభాలు, నష్టాలు తదితర విషయాలను వివరించారు.